క్లుప్తంగా

దోమలను నిర్మూలించాలి..



ఫాగింగ్ మెషీన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రామారావు, తదితరులు

పూసపాటిరేగ: దోమల నిర్మూలనతో వ్యాధులను అరికట్టవచ్చని ఎంపీడీఓ జి. రామారావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫాగింగ్ మెషీన్లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 27 పంచాయతీలకూ మెషీన్లు మంజూరయ్యాయన్నారు. పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో యంత్రాలను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ పరిసరాల పరిశీలన



రైల్వేస్టేషన్ ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, తదితరులు

విజయనగరం టౌన్: అమృత్ భారత్ పథకంలో భాగంగా విజయనగరం రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ జీఆర్‌పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటరావు ముందస్తుగా స్టేషన్ పరిసరాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల ఆరో తేదీన ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా పనులు ప్రారంభించనున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో స్టేషన్‌ను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్, జీఆర్‌పీ ఎస్సై రవివర్మ, రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



తాటిగూడలో పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్

విజయనగరం రూరల్: గరివిడి మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఎంలో భాగంగా చేపడుతున్న పనులను జెడ్పీ సీఈఓ కె. రాజ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. తాటిగూడ, కె.పాలవలస, చంద్రపురం గ్రామాల్లో జరుగుతున్న పనులు పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి కారణాలపై సమీక్షించుకోవాలి

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్‌గజపతిరాజు



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు

విజయనగరం రూరల్: శాసనసభ ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను ఓడించడంపై నాయకులంతా సమీక్షించుకుని, రానున్న ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పి.అశోక్‌గజపతిరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అశోక్ బంగ్లాలో విజయనగరం నియోజకవర్గ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీని ప్రజలు ఎందుకు రెండుసార్లు ఓడించారో సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఐవీపీ రాజు, బి.నర్సింగరావు, ప్రసాద్, కర్రోతు నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

మెట్టు భూముల్లో బిందు, తుంపర సేద్యం మేలు

చీపురుపల్లి: బిందు, తుంపర విధానంలో తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పేరిపి గ్రామంలో మంజూరు చేసిన డ్రిప్ ఇరిగేషన్ యూనిట్ పనితీరును శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో 12.24 హెక్టార్లలో ఏడు మంది రైతులకు బిందు, తుంపర సేద్యం యూనిట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. బిందు, తుంపర విధానంలో అతి తక్కువ నీటి వినియోగంతో అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చన్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతాల్లో పండ్లు, కూరగాయల పంటలకు ఈ విధానం ఎంతో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ ఆర్.సోనియా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఇంటింటా వెలుగులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



నెల్లిమర్ల రూరల్: లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఇంటింటా వెలుగులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సారిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటా పర్యటించి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ... రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. మునుపెన్నడూ లేనివిధంగా రాష్ట్ర వ్యాప్తంగా జనరంజక పాలన కొనసాగుతోందని చెప్పారు. ప్రభుత్వం చేసిన మంచితో ఏ ఇంటికి వెళ్లినా ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పచ్చ చొక్కా వేసుకుంటేనే పథకాలు వర్తించేవని... నేడు ఆ పరిస్థితి ఎక్కడా లేదన్నారు. ఎవరికీ లంచం ఇచ్చే పరిస్థితి లేకుండా పథకాల సొమ్మును నేరుగా అక్క,చెల్లెమ్మల ఖాతాల్లోనే పడుతున్నాయని తెలిపారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠంనాయుడు, సీనియర్ నేత దంతులూరి గిరిబాబు, సర్పంచ్ రాయి పైడమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి త్రివేణి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శైలజ, ఎంపీడీఓ గిరిబాల, ఈఓపీఆర్డీ భానోజీరావు, నాయకులు పాల్గొన్నారు.

విశేష ఆదరణ..

విజయనగరం: పట్టణంలోని 49వ డివిజన్ గాజులరేగ పరిసర ప్రాంతాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్, స్థానిక శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుంటూ, వాటికి పరిష్కారం చూపుతూ ముందుకు సాగారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రొంగలి పోతన్న, డివిజన్ నాయకుడు కె.రాజా మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. దీనివల్ల తామంతా రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ప్రజలంతా మరో మారు ఈ ప్రభుత్వానికే పట్టం కట్టనున్నారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కార్పొరేటర్లు కంటుభుక్త తవిటిరాజు, పి.ఆదిలక్ష్మి, వివిధ విభాగాల సిబ్బంది, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విజయనగరం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటి స్పీకర్ కోలగట్ల, తదితరులు

సమస్యలపై ఆరా ..

విజయనగరం: నగరంలోని 11వ డివిజన్ కాటవీధి పాత రామ మందిరం నుంచి శుక్రవారం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందలేని వారి వివరాలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. అనంతరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు మాట్లాడుతూ, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థతో తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తుండడంతో సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టినట్లు అయిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంపడాపు శ్రీనివాసరావు, జోనల్ ఇన్‌చార్జ్ గుజ్జల నారాయణరావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు

అత్యవసర సమయంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న వెంకటరమణ

విజయనగరం ఫోర్ట్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళకు రక్తందానం చేసి ఆదర్శంగా నిలిచాడు ఓ యువకుడు. వివరాల్లోకి వెళితే.. గజపతినగరం ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో గజపతినగరానికి చెందిన కె. మహాలక్ష్మి చికిత్స పొందుతోంది. అయితే ఆమె అత్యవసరంగా ఓ నెగిటివ్ గ్రూప్ రక్తం ఎక్కించాలని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు సాధన యూత్ క్లబ్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌ను సంప్రదించారు. దీంతో ఆయన క్లబ్ సభ్యుడు సముద్రాల వెంకటరమణను విజయనగరంలో ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌కు పంపించగా.. అక్కడి సిబ్బంది వెంకటరమణ రక్తం సేకరించి, మహిళకు అవసరమైన ఓ నెగిటివ్ బ్లడ్‌ప్యాకెట్‌ను అందించారు. సమయానికి రక్తదానం చేసిన వెంకటరమణను రెడ్‌క్రాస్ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు రాము, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగారావు

విజయనగరం అర్బన్: జిల్లాలో ఇటీవల బదిలీ అయిన, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక అమర్ భవన్‌లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు పలు తీర్మానాలు చేశారు. రేషనలైజేషన్ కారణంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు, పదోన్నతులు లభించిన టీచర్లు వందల సంఖ్యల్లో ఉన్నారని.. వారికి రెండు నెలలుగా జీతాలు విడుదల కావడం లేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న జెడ్పీ పీఎఫ్‌లు, ఏపీ జీఎల్ఐ రుణాలు, సరెండర్ లీవ్‌లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీకి చట్ట బద్ధత కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు వై.అప్పారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.జోగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వి.గోవిందరావు, జిల్లా అదనపు కార్యదర్శి సూరిబాబు, ఎస్టీ కన్వీనర్ ఎస్ఎస్ దొర పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం రేపు

విజయనగరం రూరల్: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6న విజయనగరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మీ స్నేహానికి గుర్తుగా మీ స్నేహితులతో రండి' నినాదంతో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. యువత అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని కోరారు.

భవన నిర్మాణ కార్మిక సంఘ మహాసభ రేపు

విజయనగరం పూల్‌బాగ్: భవన నిర్మాణ కార్మిక సంఘం మండల మహాసభ ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు రెడ్డి శంకరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక జొన్నగుడ్డి, శాంతినగర్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పెయింటింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కంది త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన

గుర్ల: ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా ఉండాలని డీసీసీబీ మేనేజర్ ప్రీతి మానస అన్నారు. మండలంలోని పాలవలసలో ఆర్థిక లావాదేవీలపై శుక్రవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీసీసీబీలో డిపాజిట్లపై 8.7శాతం వడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇతర వాణిజ్య బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే గృహ, వాహన, విద్యారుణాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్ నంబరు చెప్పొద్దని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ సిబ్బంది, గూడేం సొసైటీ సీఈఓ శీర స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కోలగట్లకే ప్రజా మద్దతు



అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కోలగట్ల, తదితరులు

విజయనగరం: నగరాన్ని అన్నివిధాలా అభివద్ధి చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి ప్రజా మద్దతు ఉందని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. నగరంలోని 46, 47 డివిజన్ల పరిధిలో సుమారు రూ.35 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారులు, కాలువలు, తదితర అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం 46వ డివిజన్ కార్పొరేటర్ బి. గోవిందమ్మతో కలిసి మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, శంకుస్థాపన మాసోత్సవాల్లో భాగంగా ప్రతి డివిజన్‌లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సైతం నగర అభివద్ధి చూసి కొనియాడారని తెలిపారు. మళ్లీ కోలగట్లకే పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.పైడిరాజు, జోనల్ ఇన్‌చార్జ్‌లు దుబే, తమ్ము, నాయకులు లక్ష్మణ, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో సత్వర సేవలు



సారిపల్లిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: అవినీతికి తావులేకుండా ప్రజలకు సత్వర సేవలు అందించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సారిపల్లిలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, పౌరసేవలు అందించడం జగనన్న పరిపాలన దక్షతకు నిదర్శనమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా స్థానికంగా ప్రభుత్వ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. మిగిలిన రాష్ట్రాలు కూడా సచివాలయ వ్యవస్థ ఏర్పాటుకు సుముఖత చూపుతున్నాయని చెప్పారు. అభివద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చి అర్హులందరికీ పథకాలు అందిస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, సర్పంచ్ రాయి పైడమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి త్రివేణి, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీను, తహసీల్దార్ శైలజ, ఎంపీడీఓ గిరిబాల, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా నాటుతున్న ప్రతి మొక్కనూ సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 28వ డివిజన్ పీఎస్సార్ కాలనీలో ఉన్న పార్కులో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర ఆర్. శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, మానవాళికి ప్రాణవాయువునిచ్చే మొక్కలను అత్యంత బాధ్యతయుతంగా సంరక్షించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. నగరంలో పార్కుల అభివృద్ధికి కమిటీలను ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతను అప్పగిస్తామని చెప్పారు. నగరంలో ఉన్న పార్కులు, వివిధ ప్రాంతాలలో రూ. 70 లక్షలు వెచ్చించి మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పీఎస్సార్ కాలనీలో ఉన్న పార్కులో 400 మొక్కలు నాటినట్లు చెప్పారు. డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్ మాట్లాడుతూ, నగరం ఇప్పటికే కొత్త అందాలను సంతరించుకుందన్నారు. నాటిన ప్రతి మొక్కనూ బతికించుకోవలసిన ఆవశ్యకత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. శ్రీనివాసరావు, పీఎస్సార్ కాలనీ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తల్లిపాలు శ్రేయస్కరం



విజయనగరం ఫోర్ట్: లబ్ధిదారులకు కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ ఈశ్వరమ్మ



పూసపాటిరేగ: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న సూపర్‌వైజర్ సత్యవతి, తదితరులు



విజయనగరం రూరల్: పౌష్టికాహార సరుకులు అందజేస్తున్న నాయకులు

పూసపాటిరేగ: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి అన్నారు. మండలంలోని నడిపల్లిలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బిడ్డ పుట్టగానే తల్లిపాలు ఇచ్చినట్లయితే ఎటువంటి వ్యాధులు దరి చేరవన్నారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉందదని తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కార్యకర్త అనిత, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

విజయనగరం ఫోర్ట్: తల్లిపాలు అమృతంతో సమానమని 44వ డివిజన్ కార్పొరేటర్ సైలాడ ఈశ్వరమ్మ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా అయ్యన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని తెలిపారు. తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని.. దీనివల్ల పిల్లలు నీళ్ల విరోచనాలు, నిమోనియో వంటి వ్యాధుల బారిన పడకుండా ఉంటారని చెప్పారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురంలో..

విజయనగరం రూరల్: మండలంలోని నారాయణపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యడ్ల పైడిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని అందజేశారు. భావితరాల ఆరోగ్యమే ప్రధానంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందజేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పి.ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర మణిదీప పూజలు



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు

జిల్లా కేంద్రంలోని మయూరి కూడలిలో గల సంతోషిమాత ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సహస్ర మణిదీపం పూజలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొనడంతో ఆలయం కళకళలాడింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



సామూహిక సహస్ర మణిదీపం పూజలో పాల్గొన్న మహిళలు